క్లుప్తంగా

తెనాలిలో కుండపోత



తెనాలి అర్బన్: అల్పపీడనం ప్రభావం కారణంగా పట్టణంలో శుక్రవారం ఉదయం నుంచి వర్షం పడుతూ ఉంది. ఉదయం కొద్దిసేపు ఎండ వచ్చినప్పటికీ అంతలోనే వాతావరణం చల్లబడి కుండపోత వర్షం గంటపాటు కురిసింది. మళ్లీ కొద్దిసేపు ఎండ కాచింది. అనంతరం చల్లబడి చిరుజల్లులు కురిశాయి. దీంతో పట్టణంలోని పల్లపు రోడ్లు కొన్ని జలమయమయ్యాయి.

యువతి అదృశ్యంపై కేసు

కొల్లూరు: కంప్యూటర్ క్లాస్‌కు అని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చింతర్లంకలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చింతర్లంకకు చెందిన ఓ యువతి డిగ్రీ పూర్తి చేసిన అనంతరం రోజూ బస్సులో తెనాలిలో కంప్యూటర్ తరగతులకు వెళ్లి వస్తుంది. ఈనెల 8న కంప్యూటర్ తరగతులకు అని వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్ద, చుట్టు పక్కల ప్రాంతాలలో వెతికారు. యువతి ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి. ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫైలేరియా, జ్వరాలపై అవగాహన

భట్టిప్రోలు: భట్టిప్రోలులో ఫైలేరియా ప్రబలుతుందన్న అంశంపై 'బోద'పడుతుందా అన్న శీర్షికన గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్య శాఖ రేపల్లె సబ్ యూనిట్ ఆఫీసర్ వైవీ కృష్ణయ్య శుక్రవారం భట్టిప్రోలు వచ్చారు. భట్టిప్రోలు కొత్త విఠలేశ్వర నగర్ కాలనీలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ప్రసన్నబాబు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

జయజయహే మహిషాసురమర్దని...



తెనాలి రామలింగేశ్వరపేటలో శ్రీ మహిషాసురమర్దనిగా..



తెనాలి శ్రీపట్టాభిరామస్వామి దేవస్థానంలో..



తెనాలి దేవీచౌక్‌లో మహిషాసురమర్దనిగా..



తెనాలి మారిస్‌పేటలో శ్రీమహిషాసురమర్దనిగా..



తెనాలిలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో..



శ్రీమహా కాళికాదేవిగా శ్రీ రాజరాజేశ్వరిదేవి



నందివెలుగులో సంతాన లక్ష్మి దేవిగా -తెనాలి

'డిజైన్ చేసుకున్నట్టే జీవించాడు'

'అది అతని సంతకం' అనిపించుకున్నాడు

తెనాలి: అబద్ధ లేని జీవనం.. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రయాణం.. ప్రతి అడుగులోనూ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. జీవిత చరమాంకంలోనూ తాను డిజైన్ చేసుకున్నట్టే భార్యతో కలసి జీవనం సాగించాడు.. కృష్ణమూర్తి అనే వ్యక్తి నిబద్ధత గల జీవితం కథే 'అది అతని సంతకం' సాంఘిక నాటకం. వీణా అవార్డ్స్-2024 నాటకోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాంఘిక నాటక విభాగంలో అభినయ ఆర్ట్స్, గుంటూరు వారు ప్రదర్శించారు. స్నిగ్ధ రచించిన ఈ నాటకానికి సీనియర్ దర్శకుడు ఎస్.రవీంద్ర రెడ్డి దర్శకత్వం వహించటమే కాకుండా ప్రధానమైన కృష్ణమూర్తి పాత్రలో నటించారు.

కళల కాణాచి-తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాంఘిక పద్యనాటక, సాంఘిక నాటక, నాటికల పోటీల్లో అయిదో రోజున మరో రెండు సాంఘిక నాటికలనూ ప్రదర్శించారు. లలితశ్రీ కళాసమితి, శ్రీకాకుళం వారి 'మతమా మానవత్వమా' నాటిక పేరుకు తగినట్టే మతం శాశ్వతం కాదనీ, మానవత్వమే శాశ్వతమని సందేశాన్నిచ్చింది. కంచర్ల సూర్యప్రకాశరావు రచనకు ఎల్.రామలింగస్వామి దర్శకత్వం వహించారు.

చివరగా యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్, హైదరాబాద్ వారి 'నా శత్రువు' నాటికను ప్రదర్శించారు.



'అది అతని సంతకం' సాంఘిక నాటకంలో సన్నివేశం

వర్తమానంలో మనిషి టెక్నాలజీతో గడపటం అధికమైంది. స్క్రీన్ టైమ్ గంటలు కొడుతోంది. బంధాలు, అనుబంధాలకు దూరమవుతున్నాడు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే, దానికి మించిన మిత్రుడు ఉండడు...అవసరం లేకున్నా దానితోనే గడిపితే జీవితంలో ఊహించని ప్రమాదాలు జరుగుతాయని చెప్పిందీ నాటిక. అక్కల తామేశ్వరయ్య రచించిన నాటికను వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో ప్రదర్శించారు.

కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి దేవరపల్లి భవాని ఇతర కార్యవర్గసభ్యులు పర్యవేక్షించారు.



'మతమా మానవత్వమా' సాంఘిక నాటికలో దృశ్యం

12 మద్యం దుకాణాలకు 131 దరఖాస్తులు

రేపల్లెరూరల్: మద్యం షాపుల కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగిసినట్టు రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఆర్.దివాకర్ చెప్పారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన దరఖాస్తుల వివరాలు వెల్లడించారు. తమ పరిధిలోని రేపల్లె, రేపల్లె రూరల్, భట్టిప్రోలు మండలాలకు సంబంధించి 12 దుకాణాలకు 131 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. రేపల్లె పట్టణంలో 3 దుకాణాలకు 42 దరఖాస్తులు, రేపల్లె మండలంలోని 4 దుకాణాలకు 37 దరఖాస్తులు, భట్టిప్రోలు మండలంలోని 5 దుకాణాలకు 52 దరఖాస్తులు అందాయని వివరించారు. బాపట్లలో సోమవారం కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో షాపుల కేటాయింపు జరుగుతుందని వివరించారు.

నిబద్ధతతో పనిచేయాలి



సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్: ఏ సంస్థలో పనిచేసినా ఆ సంస్థ సమిష్టి ప్రయోజనం కోసం నిబద్ధతతో పని చేస్తే యాజమాన్యంతో పాటు ఉద్యోగులకు మంచి భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్ ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌లో శుక్రవారం దసరా వేడుకలను పురస్కరించుకుని సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకురాలు మంచికలపూడి సరోజిని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళల ఉపాధి కోసం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సంస్థ ప్రయోజనాలను కాపాడే విధంగా యాజమాన్యం విధివిధానాలకు అనుగుణంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.సంసంగిరావు, నేల జయలక్ష్మీ, ఎం. శేషగిరి, జె.అనుపమ్, డాని ఆశిష్, హోలి, సుహాస్, హన్విత్, వీఆర్వోలు కె.జార్జి థామస్, జి.నాగరాజు, కె.ప్రసాద్ పాల్గొన్నారు.

అప్పలస్వామి ఆలయంలో చండీహోమం

ఈ ఏడాది నుంచి శరన్నవరాత్రులు



చండీహోమంలో భక్తులు, నిర్వాహకులు

తెనాలి: శ్రీదేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం శ్రీమహిషాసురమర్దని అవతారం సందర్భంగా పట్టణ మారీసుపేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం (శ్రీరామభక్త అప్పలస్వామి ఆలయంలో)లో చండీహోమం నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో తొలిసారిగా ఈ ఏడాది శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించారు. సరస్వతి అవతారం రోజున బాలపూజ చేసి, పిల్లలకు పుస్తకాలు పెన్నులు, ఎరేజర్లు, స్కేలు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. గురువారం లలితా సహస్రహోమం చేయించి, శుక్రవారం శాస్త్రోక్తంగా భక్తులచే చండీ హోమం జరిపించారు. ఇకపై ప్రతి ఏటా వైభవోపేతంగా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తామని ధర్మకర్తలు కునపల్లీ నారాయణ స్వామి, లంక శివానంద్ కుమార్, లంక శివ ఆంజనేయ ప్రసాద్ తెలియజేశారు. ఉత్సవ పూజలను దేవాలయ అర్చకులు దినమని ధనుష్ సుబ్రహ్మణ్య శర్మ, కిరణ్ శర్మ నిర్వహించారు.

వైభవంగా నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠ

దమ్మనవారిపాలెం(కర్లపాలెం): గ్రామదేవత నాంచారమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. దమ్మనవారిపాలెంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో హోమాలు, శాంతి పూజలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురవుసాల వెంకటేశ్వరమ్మ, మాడసాని ముసలయ్య, అలపర్తి సాంబశివరావు, ఇమడా బత్తుని నరసయ్య, శ్రీనివాసరావు, హనుమంతరావు, బాలాజీ, భక్తులు తదితరులు ఉన్నారు.

10 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

బీసీ సంక్షేమ సంఘం నేత కేసన శంకరరావు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

తెనాలి: రాజ్యాంగ ప్రకరణలు 15(4), 16(4) సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని చెబుతుంటే, అగ్రకుల పేదలకు ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా ఈడబ్ల్యుఎస్ పేరిట 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వటాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం వ్యతిరేకిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను నిలుపుదల చేయాలని శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆధిపత్య కులాల పేదలెవ్వరూ అడగకుండానే ఎలాంటి కార్యక్రమాలు లేకుండానే కేంద్రం 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ, 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం బీసీలకు నష్టం చేయడానికేనని మండిపడ్డారు.

మద్యం దుకాణాలకు 552 టెండర్లు

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేయనున్న ప్రైవేటు మద్యం దుకాణాలకు తెనాలిలో పెద్ద ఎత్తున టెండర్లు వచ్చాయి. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తెనాలి పట్టణం, మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో 25 షాపులను ఏర్పాటు చేయనున్నారు. వీటికి శుక్రవారం రాత్రి 9.30 వరకు 552 టెండర్లు వచ్చినట్టు ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు. తెనాలిలి పట్టణంలోని ఒక షాపు, కొల్లిపరలోని మరో షాపుకు అత్యధికంగా 26 చొప్పున టెండర్లు దాఖలయ్యాయి. అత్యల్పంగా తెనాలి పట్టణంలోని ఓ షాపుకు 19టెండర్లు వచ్చినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇవేమి కంపెనీలు మనోహరా?!

- బ్రాండెడ్‌వి వదిలేసి.. వేరొక నూనెప్యాకెట్ల అమ్మకాలా?
- తగ్గింపు ధరల అమ్మకాలపై పెదవి విరుపు



వంటనూనెల తగ్గింపు ధరల దుకాణాన్ని ప్రారంభించిన కోమలి పద్మ

తెనాలి: రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి తక్కువ ధరలకు వంట నూనెల అమ్మకాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించినట్టు తెనాలి రైతుబజారులో వంట నూనెల అమ్మక కేంద్రం ఆరంభమైంది. గుంటూరు జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్లో రూ.125 ధరగా ఉన్న పామాయిల్ (850 గ్రాములు)ను రూ.110లకు, రూ.138 ధరకు అమ్ముతున్న సన్‌ఫ్లవర్ ఆయిల్ (910 గ్రాములు)ను రూ.124లకు విక్రయాలు చేపట్టారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని దుకాణాల వద్ద సరసమైన ధరలలో వంటనూనెల అమ్మకం పేరిట ఆరంభించిన తగ్గింపు ధరల తిరకాసుపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. ఫ్రీడమ్ వంటి బ్రాండెడ్ కంపెనీ లేదా పాపులర్ అయిన విజయా బ్రాండ్ వంట నూనెలను తగ్గింపు ధరలకు ఇస్తే బాగుండేదని, అలా కాకుండా పెద్దగా మార్కెట్ లేని గోల్డ్ విన్నర్ కంపెనీకి చెందిన సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను, పామ్‌డిలైట్ అనే కంపెనీ పామాయిల్‌ను దుకాణాల్లో విక్రయిస్తుండటమే ఇందుకు కారణం. పైగా విజయా కంపెనీ పామాయిల్ 900 గ్రాములు రూ.133లకు మార్కెట్లో లభిస్తోంది. పామ్ డిలైట్ కంపెనీ పామాయిల్ 50 గ్రాములు తగ్గించి, 850 గ్రాముల ప్యాకెట్‌ను రూ.110లకు అమ్ముతున్నారు. 900 గ్రాముల ధరతో పోల్చుకుంటే విజయా బ్రాండ్‌కు పామ్‌డిలైట్‌కు మధ్య వ్యత్యాసం కేవలం రూ.7 లేనని వినియోగదారులు గుర్తుచేస్తున్నారు. అలాగే విజయా బ్రాండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 910 గ్రాములు ప్యాకెట్ మార్కెట్లో రూ.136లకు లభ్యమవుతున్నట్టు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలకు కళ్లెం వేయకుండా తగ్గింపు ధరల పేరుతో కంటితుడుపు చర్యలకు పూనుకోవటం ఏ విధంగా సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

నూరు శాతం డోర్ టు డోర్ కలెక్షన్ జరగాలి

తెనాలిఅర్బన్: డోర్ టు డోర్ చెత్త కలెక్షన్‌ను నూరుశాతం పూర్తయ్యే విధంగా ప్రతి రోజు చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి పేర్కొన్నారు. నాలుగు, ఐదు, ఆరు శానిటరీ డివిజన్‌లకు సంబంధించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు, నగర దీపికలతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో వస్తున్న లోపాలను అధిగమించడానికి ప్రయత్నించాలన్నారు. మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నగరం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని తాడివాకవారిపాలెంలో జరిగింది. ఎస్ఐ బండ్ల భార్గవ్ సమాచారం మేరకు నగరం-బాపట్ల రహదారిలో తాడివాకపాలెం వద్ద తాడివాక దుర్గాప్రసాద్ (41) తన పొలంలో కలుపు మొక్కలను కూలీల చేత తీయుస్తు రహదారి మార్జిన్‌లో కూర్చుని ఉన్నాడు. బాపట్ల నుంచి నగరం వస్తున్న ద్విచక్రవాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను నగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దుర్గాప్రసాద్ మృత దేహానికి పోలీసులు పంచనామా చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.